## రాజన్న క్షేత్రం.. భక్తజన సంద్రం

60 వేల మందికి పైగా రాక



క్యూలైన్లో భక్తులు

వేములవాడ రాజన్న క్షేత్రం సోమవారం భక్తజన సంద్రమైంది. సుమారు 60 వేల మందికి పైగా స్వామివారిని దర్శించుకున్నారు. రద్దీతో గర్భగుడిలో భక్తులు నిర్వహించుకునే ఆర్జిత సేవలైన అభిషేక, అన్న, ఆకుల పూజలను రద్దు చేశారు. ఉదయం 6 గంటల నుంచే ఉచిత, శీఘ్ర దర్శన క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. దర్శనానికి 2 నుంచి 3 గంటల పాటు సమయం పట్టిందని భక్తులు తెలిపారు. రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకున్నారు. దాదాపు రూ.34 లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు అధికారులు వెల్లడించారు. ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. **- వేములవాడ టౌన్, అక్టోబర్ 28**

# కేటీఆర్ డిమాండ్.. దిగొచ్చిన సర్కార్

- 10 హెచ్‌పీల లిమిట్ 25 హెచ్‌పీలకు పెంపు
- హైదరాబాద్‌లో ప్రకటించిన ఈఆర్సీ
- 30 వేల మరమగ్గాలకు ప్రయోజనం
- నేత కార్మికులకు ఊరట

**సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను కుటీర పరిశ్రమగా గుర్తించాలన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన డిమాండ్‌కు ప్రభుత్వం దిగొచ్చింది. మరమగ్గాలకు 10 హెచ్‌పీల విద్యుత్ లిమిట్‌ను 25 హెచ్‌పీలకు పెంచుతూ ఈఆర్సీ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో యూనిట్ విద్యుత్‌కు ₹8.8ల నుంచి ₹4కు తగ్గనున్నది. కాగా, ఈ నిర్ణయంతో 30 వేల మరమగ్గాలకు ప్రయోజనం చేకూరనున్నందున నేత కుటుంబాల్లో హర్షం వ్యక్తమవుతున్నది.**




ఈ నెల 25న సిరిసిల్లలో నిర్వహించిన తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి బహిరంగ విచారణ కార్యక్రమంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ) : సిరిసిల్ల నేతన్నలకు ఊరట లభించింది. ఇప్పటి వరకు 10 హెచ్‌పీల వరకు మాత్రమే ఉన్న విద్యుత్ సబ్సిడీ ఇక నుంచి 25 హెచ్‌పీల వరకు వర్తించనున్నది. ఈ నెల 25న సిరిసిల్ల పద్మనాయక కల్యాణమండపంలో విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) చార్జీల పెంపుపై బహిరంగ విచారణ చేపట్టింది. ఈ కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పలు అంశాలను ఈఆర్సీ ద్వారా ప్రభుత్వానికి సూచనలు, డిమాండ్లను చేశారు. అందులో పాల్గొన్న ఈఆర్సీ చైర్మన్ తన్నీరు శ్రీరంగరావు, కేటీఆర్ చేసిన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. మొదట విద్యుత్ చార్జీలు పెంచాలన్న ఆలోచన విరమించుకోవాలని సూచించారు. అనంతరం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలంటే 10 హెచ్‌పీల లిమిట్ ఉన్న విద్యుత్‌ను 30 హెచ్‌పీలకు పెంచాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ చేసిన డిమాండ్‌కు తలొగ్గిన సర్కారు వస్త్ర పరిశ్రమను కుటీర పరిశ్రమ కింద గుర్తించింది. 10 హెచ్‌పీల విద్యుత్ లిమిట్‌ను 25 హెచ్‌పీలకు పెంచింది. సోమవారం హైదరాబాద్‌లో ఈఆర్సీ చైర్మన్ శ్రీరంగారావు విలేకరుల సమావేశం నిర్వహించి, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు విద్యుత్ రాయితీని ప్రకటించారు. 30 హెచ్‌పీలకు పెంచాలని కేటీఆర్ డిమాండ్ చేయగా, 25 హెచ్‌పీలకు పెంచుతున్నట్టు చెప్పారు. త్వరలో ఉత్తర్వులు కూడా జారీ చేయనున్నట్టు ఆయన తెలిపారు. వస్త్ర పరిశ్రమలో దాదాపు 30 వేల మరమగ్గాలున్నాయని, వేలాది మంది కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు. ఈఆర్సీ ప్రకటించిన విద్యుత్ రాయితీతో 25 హెచ్‌పీలలోపు ఉన్న మరమగ్గాలు, కండెల మిషన్లు, వార్పిన్‌లకు ప్రయోజనం చేకూరనున్నది. ఈ పరిశ్రమలో 10 హెచ్‌పీల నుంచి 25 హెచ్‌పీల వరకు మరమగ్గాలు నడిపించుకునే ఆసాములు ఎక్కువ శాతం ఉండగా, యజమానులు కొందరు ఉన్నారు. 25 హెచ్‌పీలు దాటితే విద్యుత్ రాయితీలు వర్తించవు. ప్రస్తుతం 10 హెచ్‌పీలకు యూనిట్ విద్యుత్‌కు ₹8.80 వసూలు చేస్తుండగా, అందులో ₹4.80లు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నది. మిగతా ₹4లు ఆసాములు, యజమానులు చెల్లిస్తున్నారు. పెంచిన లిమిట్ ప్రకారం 25 హెచ్‌పీల వరకు వర్తించనున్నది. ఈ వెసులుబాటుతో మరమగ్గాల ఆసాములు, యజమానులకు భారీ ఊరట లభించింది.

### తిరుపూర్‌గా అభివృద్ధి చెందాలన్నది కేటీఆర్ లక్ష్యం

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ తమిళనాడులోని తిరుపూరుకు దీటుగా అభివృద్ధి చెందాలన్నది కేటీఆర్ సంకల్పం. అందులో భాగంగా కేసీఆర్ ప్రభుత్వంలో ఆయన చేనేత జౌళీశాఖ మంత్రిగా పనిచేశారు. వస్త్ర పరిశ్రమను అవపోసన పట్టిన ఆయన, మరమగ్గాలను ఆధునీకరించి అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. సాంచాలను ఆధునీకరించడంతో పాటు రేపియర్, వాటర్ జెట్, ఎయిర్‌జెట్ లాంటి సాంచాలను ఇక్కడ ఏర్పాటు చేసుకోవాలని యజమానులకు సూచించారు. అందుకు తిరుపూరు, సూరత్, ఇచ్చల్ కరంజీ, నాగ్‌పూర్‌కు స్టడీటూర్ కోసం పంపించారు. నేతన్నలకు చేతినిండా పని కల్పించాలన్న ఉద్దేశంతో ఆయన మంత్రిగా బతుకమ్మ చీరలు, రంజాన్, క్రిస్మస్, విద్యార్థుల యూనిఫాంలు, కేసీఆర్ కిట్లు, వస్త్రాల తయారీ ఆర్డర్లు ఇప్పించారు. చేతినిండా పని, పనికి తగ్గ వేతనం పొందిన నేతన్నలు సంతోషంతో ఉండేలా చేశారు. అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయించారు. ప్రస్తుత ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వక పోవడంతో మళ్లీ వస్త్ర పరిశ్రమ సంక్షోభం వైపు మళ్లింది. పరిశ్రమ సంక్షోభాన్ని, నేతన్నల దయనీయ పరిస్థితులను అర్థం చేయించేలా ఈ నెల 25న జరిగిన ఈఆర్సీ సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. 5 హెచ్‌పీల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని, 10 హెచ్‌పీల లిమిట్ విద్యుత్ రాయితీలను 30 హెచ్‌పీలకు పెంచాలని డిమాండ్ చేశారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావుతో కలిసి వస్త్ర పరిశ్రమ డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంతో ఆయన డిమాండ్లకు దిగొచ్చిన ప్రభుత్వం అంగీకరించింది.

### ఈఆర్సీకి కృతజ్ఞతలు



వస్త్ర పరిశ్రమకు విద్యుత్ రాయితీని 25 హెచ్‌పీలకు పెంచడం హర్షించదగ్గ విషయం. సిరిసిల్లలో దాదాపు 30 వేల మరమగ్గాలున్నాయి. విద్యుత్ రాయితీల కోసం ఎదురు చూస్తున్న ఆసాములు, యజమానులకు ఎంతో ఊరట నిచ్చింది. ప్రస్తుతం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ కోసం విద్యుత్ సమస్యను పరిష్కారం చేసినందుకు ఈఆర్సీకి కృతజ్ఞతలు.

**- చిక్కాల రామారావు, సెస్ చైర్మన్**

# రేవంత్‌రెడ్డిది అరాచక పాలన

- తెలంగాణలో ఎమర్జెన్సీ రోజులు తలపిస్తున్నాయి
- బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, పక్కన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల, అక్టోబర్ 28(నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పది నెలల పాలన అరాచకంగా మారిందని బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో పరిస్థితులు ఎమర్జెన్సీ రోజులను తలపిస్తున్నాయని, ఎప్పుడు ఏమవుతుందోనని ప్రజలు భయపడే పరిస్థితిని రేవంత్‌రెడ్డి తీసుకువస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రజాకాంక్షలను నెరవేర్చడంలో విఫలమయ్యాడని, రాష్ట్రంలో రోజుకో సమస్యను సృష్టిస్తున్నాడని ఆరోపించారు. ఒక రోజు హైడ్రా తెస్తే, మరో రోజు మూసీ సుందరీకరణ అంటూ మరో అంశాన్ని లేవనెత్తుతున్నాడని మండిపడ్డారు. ఒక రోజు బెటాలియన్ కానిస్టేబుళ్ల వ్యవహారం, మరోసారి నిరుద్యోగ యువతపై లాఠీ చార్జీ, ఇంకోసారి రైతుల హామీలు తుంగలో తొక్కడం లాంటివి చేస్తున్నాడని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది కుటుంబ సభ్యులతో కలిసి గృహప్రవేశం చేసిన సందర్భంలో సొంత ఇంట్లో విందు చేసుకుంటే ఏదో జరుగుతుందని, డ్రగ్స్, విదేశీ మద్యం అంటూ పోలీసులతో దాడి చేయించి, అరెస్టులు, అక్రమ కేసులు పెట్టించడం నిజంగా సిగ్గుమాలిన చర్య అన్నారు. తల్లి, భార్య, చెల్లి, పిల్లలతో కలిసి ఎవరైనా డ్రగ్స్ పార్టీ చేసుకుంటారా..? అంటూ ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు, కేటీఆర్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే ఇలాంటి తప్పుడు రాజకీయాలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్‌లో పదవి, కాంట్రాక్టులు పొంది, ఇప్పుడు పార్టీ మారిన పొంగులేటి ముందుగా చెప్పిన ప్రకారం దాడులు చేయడం అత్యంత శోచనీయమన్నారు. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ప్రజలు తీవ్రంగా అసహ్యించుకుంటున్న తరుణంలో వారిని ఏమార్చడానికి ఇలా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న తప్పుడు ఆరోపణలకు బీజేపీ వంత పాడుతుండడం, కేంద్ర మంత్రి బండి సంజయ్ కేటీఆర్‌పై విమర్శలు చేస్తుండడం చూస్తే బీజేపీ, కాంగ్రెస్ కలిసిపోయినట్టు అనిపిస్తున్నదని, దీనిపై ఇరు పార్టీలు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా అరాచక పాలనకు స్వస్తి పలికి, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంపై దృష్టి పెట్టాలని, ఇలాంటి తప్పుడు చర్యల వల్ల రాజకీయ మైలేజీ రాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవుపలికారు.

### సంజయ్‌వి తప్పుడు కూతలు

**- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**

కేంద్ర హోంశాఖ మంత్రిని అని మరిచిపోయి బండి సంజయ్ డ్రగ్స్ అంటూ తప్పుడు కూతలు కూస్తున్నాడని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మండిపడ్డారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక కాంగ్రెస్ సర్కారు దుష్ప్రచారం చేయడం అత్యంత దారుణమని ఆవేదన చెందారు. జగిత్యాలలో ఆయన మాట్లాడుతూ కేటీఆర్ బావమరిది జన్వాడలో గృహప్రవేశ కార్యక్రమం సందర్భంగా విందు ఏర్పాటు చేసుకుంటే, అక్కడ నాలుగు మద్యం సీసాలు ఉంటే దానికి డ్రగ్స్ పేరు వాడడం సరికాదని సూచించారు. ఇంట్లో చిన్న పిల్లలు, 70ఏళ్ల వయసున్న మహిళలు, కుటుంబ సభ్యులు రేవ్ పార్టీలో పాల్గొన్నారని రేవంత్ ప్రభుత్వం దుష్ప్రచారం చేయడం వారి నీచ సంస్కృతికి నిదర్శనమని మండిపడ్డారు. వాస్తవాలు తెలుసుకోకుండా సంజయ్ మాట్లాడడం సరికాదని సూచించారు. డ్రగ్స్‌ను మంచాల కింద, బనియన్ లోపలి వైపు దాస్తారంటూ చెబుతున్న తీరును చూస్తే ఆయనే డ్రగ్స్ వ్యాపారం చేస్తున్నట్టు అనిపిస్తున్నదని అనుమానం వ్యక్తం చేశారు. అసలు ఆయనకు, ఆయన కొడుక్కు డ్రగ్స్ పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంట్లో జరిగిన విందుకు రేవ్‌పార్టీ కలర్ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రానున్న రోజుల్లో మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. తెలంగాణ సాధకుడు అయిన కేసీఆర్ కుటుంబాన్ని అభాసుపాలు చేసే కుట్రలు సాగవని స్పష్టం చేశారు.

### ధాన్యం కొనుగోళ్లపై దృష్టి పెట్టండి

**- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత**

ప్రభుత్వం ఎవరి ఇంట్లో ఏం ఫంక్షన్ జరుగుతుందని దృష్టి పెట్టడం కాదని, ధాన్యం కొనుగోళ్లపై పెడితే రైతుల ఇబ్బందులు తీరుతాయని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తున్నదని మండిపడ్డారు. కుటుంబ సభ్యులు, ఆడవాళ్లు, పిల్లలు, వృద్ధులతో కలిసి విందు నిర్వహించుకుంటే దానిని రేవ్‌పార్టీగా వక్రీకరించడం సరికాదన్నారు. పథకాల అమలులో ప్రభుత్వం విఫలమైందని, రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే వారి దృష్టిని మరల్చేందుకు ఇలా చేయడం సరికాదని హితవు పలికారు. మాజీ మంత్రి కేటీఆర్, వారి కుటుంబ సభ్యులపై రేవంత్ సర్కారు చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మహిళలంటే చులకన భావం ఉందన్నారు. నిండు శాసనసభలోనే మాజీ మంత్రి సబిత ఇంద్రారెడ్డిని అవమానించిన తీరే అందుకు నిదర్శనమన్నారు. ఇక్కడ గట్టు సతీశ్, అల్లాల ఆనంద్ రావు, అమీన్ బాయ్, వోల్లం మల్లేశం, శీలం ప్రియాంక ప్రవీణ్ రిజ్వాన్, గాజుల శ్రీనివాస్, మోర వెంకటేశ్వర్లు, నిరటి శ్రీనివాస్, మధుసూదన్ రావు ఉన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నాయకులు

# పిచ్చిగా మాట్లాడితే ఊరుకునేది లేదు

- ఐబీ, ఇంటలిజెన్స్ ఉన్నది మీ చేతిలోనే కదా..
- ఏం తెలుసుకోకుండానే విమర్శలా..?
- మహిళలకు క్షమాపణ చెప్పాల్సిందే
- బండి సంజయ్‌పై బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ధ్వజం

కరీంనగర్ కార్పొరేషన్, అక్టోబర్ 28 : కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అసలు ఏం జరిగిందో తెలుసుకోకుండానే ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని, ఆయన హోదాకు ఉన్న గౌరవం తీసేస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు విమర్శించారు. కేంద్ర హోం శాఖలోనే ఐబీ, ఇంటెలిజెన్స్ ఉంటుందని, వారి నుంచి ఎలాంటి నివేదికలు తీసుకోకుండా, ఆధారాలు లేకుండా విమర్శలు చేయడం సరికాదని సూచించారు. రేవ్ పార్టీ అంటూ ఇష్టం వచ్చినట్టుగా అదుపు లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పిచ్చిగా మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం కేటీఆర్, కేసీఆర్‌ను నిందించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. కక్ష సాధింపుతో డైవర్షన్ రాజకీయాల కోసం కేటీఆర్‌ను నేరుగా ఎదుర్కోలేక కాంగ్రెస్ ప్రభుత్వం వారి బావమరిదిపై తప్పుడు కేసులు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అమ్మవారి భక్తుడని చెప్పుకొనే బండి సంజయ్ మహిళలను కించపర్చేలా ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ఆయనకు సనాతన ధర్మం ఇదే నేర్పిందా? అని ప్రశ్నించారు. కేటీఆర్‌కు టెస్టులు కాదు.. బండి సంజయ్‌కి చేయాలని డిమాండ్ చేశారు. ఆయన తప్పుడు సంస్కారం ఏంటో టెస్టులు చేస్తే బయట పడుతుందన్నారు. దేశంలో డ్రగ్స్ వాడకంలో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో ఉందని, అక్కడ ప్రతి ఏటా 32 వేలకు పైగా కేసులు అవుతున్నాయని, అలాగే మహారాష్ట్రలో 29 వేలు, పంజాబ్‌లో 20 వేలకు పైగా కేసులు అవుతున్నాయన్నారు. కేంద్ర మంత్రి హోదాలో హోంశాఖ నుంచి వీటిని కట్టడి చేయడానికి బండి సంజయ్ ఏం చేస్తున్నారో ప్రజలకు చెప్పాలన్నారు. పంజాబ్‌లో బీజేపీ ఎమ్మెల్యేనే పట్టుబడ్డారని, అలాగే హైదరాబాద్‌లో గతంలో బీజేపీ జాతీయ కార్యదర్శి పట్టుబడ్డారని గుర్తు చేశారు. దీనిపై ఆయన మాట్లాడాలన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు ఆగిపోతే మాట్లాడని ఆయన, కేసీఆర్ కుటుంబంపై మాత్రం లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కానిస్టేబుళ్ల ధర్నా చేస్తుంటే ఏం చేశారని ప్రశ్నించారు. హైడ్రా, మూసీ ఫ్రంట్ సమస్యలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి, బీజేపీ కుమ్మక్కై బీఆర్ఎస్‌పై, కేసీఆర్ కుటుంబంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. ఏదో రోజు రేవంత్‌రెడ్డి బీజేపీ సీఎంగా మారుతారని జోస్యం చెప్పారు. సనాతన ధర్మం కాపాడేవాడినని చెప్పుకొనే సంజయ్ హైదరాబాద్‌లో అమ్మవారి విగ్రహాలను తొలగిస్తుంటే ఎందుకు స్పందించలేదని నిలదీశారు. మంత్రిగా కూడా ఏమీ చేయలేని సంజయ్ వల్ల కరీంనగర్ ప్రజలు సిగ్గుపడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా పిచ్చి మాటలు మానుకోవాలని, లేకపోతే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మహిళలను కించపర్చేలా మాట్లాడిన బండి సంజయ్ మహిళలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్, నాయకులు ఆరె రవిగౌడ్, సత్తినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఉద్యమ కుటుంబంపై కుట్ర

- తెచ్చుకున్న రాష్ట్రాన్ని ఆగం చేస్తున్నరు
- సిగ్గుపడేలా కేంద్ర మంత్రి మాటలు
- కమీషన్ల కవ్వంపల్లి.. వడ్లు కొనేలా చూడు
- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

తిమ్మాపూర్, అక్టోబర్ 28 : రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ కుటుంబంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతి విషయంలో తలదూరుస్తూ కుట్ర పన్నుతున్నదని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ విమర్శించారు. ఏండ్లు కష్టపడి సాధించుకున్న తెలంగాణను రేవంత్‌రెడ్డి సర్కారు ఆగం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కమీషన్ల సత్యనారాయణ చేష్టలతో మానకొండూర్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి గెస్ట్‌హౌస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో చావైనా, బతుకైనా పండుగలా జరుపుకోవడం సంస్కృతి అని, అది మరిచి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బామ్మర్ది నూతన గృహప్రవేశం సందర్భంగా ఇస్తున్న దావత్‌ను రచ్చచేసి రాజకీయం చేశారని మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను కేటీఆర్ ఎండగడుతుండడం వల్లనే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో కరీంనగర్ జిల్లాకు పేరు ప్రతిష్టలున్నాయని, కానీ కేంద్ర సహాయ మంత్రిగా ఉన్న బండి మాటలు సిగ్గుపడేలా ఉన్నాయని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ప్రశ్నించాల్సిన ఆయన తీరు ఆశ్చర్యకరంగా ఉందన్నారు. బండి మాటలతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుబంధం బయటపడుతున్నదన్నారు.

### కమీషన్ల పిచ్చి పట్టింది

ఎమ్మెల్యే సత్యనారాయణకు కమీషన్ల పిచ్చి పట్టిందని రసమయి ఆరోపించారు. తిమ్మాపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి కాంట్రాక్టు పూర్తి కాకముందే ₹2.5 కోట్లు కమీషన్లు అడిగినట్లు తన వద్ద ఆధారాలున్నాయని చెప్పారు. తాను ఆయనలాగా కమీషన్లు తీసుకోలేదని, అన్ని పర్మిషన్లు తీసుకుని ఫౌల్ట్రీ ఫాం బిజినెస్ చేసుకుంటున్నామని స్పష్టం చేశారు. రాజకీయం చేస్తే బాగుంటుందని, వ్యక్తిగత విమర్శలకు దిగాడని, ఇక ఆయన పతనం ప్రారంభమైందని హెచ్చరించారు. ఎమ్మెల్యే ఏం చేస్తున్నాడో తన వద్ద అన్ని ఆధారాలూ ఉన్నాయని, రోజుకో లీక్ చేస్తానని చెప్పారు. సిద్దిపేట కమిషనరేట్ పరిధిలోని ఇద్దరు ఎస్ఐలు శివప్రసాద్, హరిప్రసాద్‌రెడ్డి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో ఉంటూ దందాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇక్కడి ప్రజలను షాడో ఎమ్మెల్యేతో కలిసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. జమ్మికుంటలోని వారికి చెందిన సురక్ష దవాఖానలో దొంగ బిల్లులు చేయించి సీఎంఆర్ఎఫ్ స్కాం చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే అనుచరుడైన కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఓ గ్రామానికి అర్ధరాత్రి వెళ్లి వివాహితతో దొరికిన వీడియో బయటకు వస్తే సస్పెండ్ చేయాల్సింది పోయి.. వెనుకేసుకొస్తున్నాడని, ఆయనలాగే ఆయన అనుచరులున్నారని దుయ్యబట్టారు. ఆ వీడియోను కాంగ్రెస్ నాయకులే మీడియాకు పంపారని, ఓ చానల్‌లో వార్త వస్తే తనకు లింకు పెట్టి అనుచరులతో తిట్టించడమేంటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి వదిలేశాడని, అక్కడ రైతులు పడుతున్న ఇబ్బందులను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోళ్లు లేక రైతులు మధ్యవర్తులు, రైస్‌మిల్లర్లకు తక్కువకే అమ్ముకుంటున్నారని, కొంచెం కమీషన్లు, తనపై పగను పక్కన పెట్టి రైతులకు నష్టం లేకుండా చూడాలని హితవుపలికారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పక్కన గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, నాయకులు

# దమ్ముంటే రాజకీయంగా కొట్లాడాలి

బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 28 : పరిపాలన చేతకాక సీఎం రేవంత్‌రెడ్డి మెదడు నిండా విషం నింపుకుని దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య విమర్శించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ కుటుంబంపై విషం చిమ్మడమే లక్ష్యంగా రేవంత్ ప్రభుత్వం పని చేస్తున్నదని ఆరోపించారు. దమ్ముంటే రాజకీయంగా కొట్లాడాలని సూచించారు. లేనిపక్షంలో ప్రజలే త్వరలో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన గ్యారెంటీలను అమలుచేయకుండా రేవంత్ ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. రైతుల పక్షాన నిలబడి పోరాడుతున్న కేటీఆర్‌ను వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టేందుకు కొత్త కుట్రకు తెరలేపారని ధ్వజమెత్తారు. తెలంగాణ సంప్రదాయ పద్ధతిలో పండుగ చేసుకున్న కేటీఆర్ బావమరిది పాకాల రాజు ఇంట్లోకి చొరబడి తన అనుకూల మీడియాతో తప్పుడు ప్రచారం చేయించారని విమర్శించారు. డ్రగ్స్ దొరకలేవని ఎక్సైజ్ అధికారులు చెప్పినా కొందరు కాంగ్రెస్, బీజేపీ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారన్నారు. రఘునందన్‌రావు, ఆది శ్రీనివాస్ అవగాహన లేకుండా మాట్లాడడం వారి విజ్ఞతకు వదిలేస్తున్నామన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ చిల్లర మాటలు మానుకోవాలని హితవుపలికారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య మాట్లాడుతూ విప్ ఆది శ్రీనివాస్ అవగాహన లోపంతో అడ్డగోలు వ్యాఖ్యలు చేస్తున్నారని, అలాంటివి మానుకోవాలని హితవుపలికారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే ఇలాంటి వ్యవహారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ కౌన్సిలర్ అన్నారం శ్రీనివాస్, అర్బన్ బ్యాంకు వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దిడ్డి రాజు, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్, సెస్ మాజీ డైరెక్టర్ కుంబాల మల్లారెడ్డి, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ శంకర్, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు మెంగని మనోహన్, కంచర్ల రవిగౌడ్ పాల్గొన్నారు.




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

# ఫీజు బకాయిలను విడుదల చేయాలి

తెలంగాణచౌక్, అక్టోబర్ 28 : విద్యార్థులకు ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్, కార్యదర్శి మారుతి మాట్లాడుతూ, విద్యార్థులకు ₹6,350 కోట్ల ఫీజులు పెండింగ్‌లోఉన్నాయని తెలిపారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి పది నెలలు అవుతున్నా ఇప్పటి వరకు ఫీజు బకాయిలను విడుదల చేయలేదని మండిపడ్డారు. ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని కూడా కేటాయించలేని దుస్థితితో కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని విమర్శించారు. ఇక్కడ పీడీఎస్‌యూ నాయకులు అంజని, ప్రసాద్, శేఖర్, శ్రావణి, అంజలి పాల్గొన్నారు.